

బీఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లో పాదయాత్ర నిర్వహించి సమస్యలను తెలుసుకుంటున్న జోనల్ కమిషనర్ హేమంత్ పాటిల్, కార్పొరేటర్ లచ్చిరెడ్డి

బీఎన్‌రెడ్డినగర్ అభివృద్ధికి కృషి

● ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్

వనస్థలిపురం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ అభివృద్ధికి తన వంతుగా కృషి చెస్తాననీ ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌అన్నారు. మంగళవారం జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి, హయత్‌నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ తిప్పర్తి యాదయ్యలతో కలిసి బీఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లోని పలు కాలనీల్లో పాదయాత్ర నిర్వహించి కాలనీవాసుల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వైదేహి నగర్ లోని సాయిబబా దేవాలయం వరకు వాహనదారులకు, కాలనీవాసులు వెళ్లడానికి ఇబ్బందికరంగా ఉన్న రోడ్డుపై నూతన రోడ్డు మంజూరు చేయాలనీ, సాహెబ్‌నగర్‌లోని శ్రీ సీతారామాంజనేయ కల్యాణ మండపాన్ని మరమ్మతులు చేయించి, నూతన రంగులు వెయించాలనీ, విజయపురి కాలనీ మెడ్‌ప్లస్ నుంచి మెడికల్ అండ్ హెల్త్ కాలనీ వరకు పాడైన రోడ్డు స్థానంలో నూతన రోడ్లు వేయాలనీ కార్పొరేటర్, కాలనీవాసులు కమిషనర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రాధాన్యత క్రమంలో భాగంగా ప్రతి సమస్యను పరిష్కరించి డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఈఈ ఆశలత, టౌన్‌ప్లానింగ్ విజయశ్రీ, డీఇ దామోధర్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.



గ్రంథాలయ చైర్మన్ ఉపేందర్ రెడ్డిని సన్మానిస్తున్న లైబ్రేరియన్

గ్రంథాలయాల సమస్యల పరిష్కారానికి కృషి

● నగర గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఉపేందర్ రెడ్డి

సైదాబాద్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హైదరాబాద్ నగర గ్రంథాలయ సంస్థ చైర్మన్ కె. ఉపేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం చంపాపేట నాగార్జున కాలనీలోని శాఖ గ్రంథాలయాన్ని ఆయన కార్యదర్శి పద్మజతో కలిసి తనిఖీ చేశారు. గ్రంథాలయంలో నెలకొన్న సమస్యలను పాఠకులను అడిగి తెలుసుకున్నారు. ఎలక్ట్రికల్ మరమ్మతులు, కొత్త పుస్తకాలు, వైఫై సదుపాయం, వాటర్ ప్యూరిఫైయర్ వంటి సమస్యలను చైర్మన్‌కు విరించారు. తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను త్వరితగతిన పరిష్కారిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా చైర్మన్‌ను లైబ్రేరియన్ పీవీఎం కృష్ణారెడ్డి శాలువాతో సత్కరించారు.



కేంద్ర బలగాలతో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న ఏసీపీ వెంకన్న నాయక్

సైదాబాద్, మాదన్నపేటలో పోలీసుల ఫ్లాగ్‌మార్చ్

సైదాబాద్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): సైదాబాద్, మాదన్నపేట పోలీస్ స్టేషన్ల పరిధిలో మంగళవారం కేంద్రబలగాలు, పోలీసులతో కలిసి సైదాబాద్ ఏసీపీ వెంకన్న నాయక్ ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ముందుగా సైదాబాద్ పీఎస్ నుంచి ప్రారంభమైన మార్చ్ సపోటాబాగ్, జీవన్‌యార్ జంగ్ కాలనీ, పూసల బస్తీ, రెడ్డిబస్తీ, చేపల మార్కెట్, చావునీ, మాదన్నపేట మండి, భరత్‌నగర్, రెయిన్‌బజార్‌ల మీదుగా కొనసాగింది, ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ శాంతి భద్రతల్లో భాగంగా క్షేత్రస్థాయిలో ప్రజలకు భరోసా కలిగించేందుకు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మార్చ్‌లో సైదాబాద్ ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్, డీఐ ఆనంద్ కుమార్, శివశంకర్, సాయికృష్ణ, నవీన్, వెంకటేశ్వర్లు, మాదన్నపేట ఇన్‌స్పెక్టర్ బి.శ్రీనివాస్, డీఐ దాసు, ఎస్సైలు వెంకటరమణ, శోభ పాల్గొన్నారు.



ఇన్‌స్పెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు ప్రవీణ్‌రెడ్డి తదితరులు

విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

●పోలీసులకు కాంగ్రెస్ నేతల ఫిర్యాదు

ఎల్బీనగర్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఫీజుల కోసం విద్యార్థులను వేధిస్తున్న కార్పొరేట్ విద్యా సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎల్బీనగర్ నియోజకవర్గం కాంగ్రెస్ నాయకుడు ప్రవీణ్‌రెడ్డి మాట్లాడుతూ లింగోజిగూడ డివిజన్‌లోని పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్ యాజమాన్యం ఏడు వేల ఫీజులు చెల్లించలేదని విద్యార్థులను పరీక్షలు రాయనీయకుండా బయట కూర్చోబెట్టిన సంఘటనను కార్పొరేటర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. స్పందించిన కార్పొరేటర్ వెంటనే పాఠశాలకు వెళ్లి ప్రిన్సిపాల్‌తో మాట్లాడి పరీక్ష రాసే విధంగా చర్యలు చేపట్టారన్నారు. విద్యాసంస్థల్లో ఫీజులు చెల్లించలేదని విద్యార్థులను వేధించకుండా వారి తల్లిదండ్రులతో మాట్లాడే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎల్బీనగర్ ఇన్‌స్పెక్టర్ వినోద్‌కుమార్, ఎస్ఐ శేఖర్‌రెడ్డిలకు కాంగ్రెస్ నాయకులు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఇన్‌స్పెక్టర్ తగు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు ప్రవీణ్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పల్లం శ్రీధర్‌గౌడ్, శ్రీనాథ్‌రావు, రోహిత్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్య

అబ్దుల్లాపూర్‌మెట్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తి చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీస్‌స్టేషన్ పరిధిలోని తారామతిపేట గ్రామానికి చెందిన చేగూరి బాలయ్య(56) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. సోమవారం రాత్రి 7.30 గంటల సమయంలో ఇంట్లో చెప్పకుండా బయటకి వెళ్లాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో మంగళవారం ఉదయం కుటుంబ సభ్యులు చుట్టు పక్కల వెతికారు. శివారులోని సర్వే నంబర్ 216, 217లో చెట్టుకు తాడు సాయంతో ఉరేసుకుని కనిపించాడు. మృతుడి కుమారుడు శివ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ అదృశ్యం



వనస్థలిపురం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన మహిళ అదృశ్యమైన సంఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వనస్థలిపురం సచివాలయనగర్‌కు చెందిన బరిగెల పద్మ(35) తన భర్త జంగయ్యతో నివాసముంటుంది. పని ఉందని చెప్పి ఈ నెల 20న ఉదయం 6 గంటలకు ఇంట్లో నుంచి బయటకు వెళ్లింది. తన వెంట తీసుకెళ్లిన ఫోన్ స్విచ్ ఆఫ్ వస్తుంది. ఎంతకి పద్మ ఆచూకీ లభించకపోవడంతో పద్మ సోదరుడు విజయ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

● బడంగ్‌పేట్ మేయర్ పారిజాతారెడ్డి

సరూర్‌నగర్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, అందుకే వార్డు సభలు నిర్వహిస్తున్నామని బడంగ్‌పేట్ మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి అన్నారు. తెలంగాణ ప్రభుత్వం రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాల అమలుకు కట్టుబడి ఉన్నదని ఆమె పేర్కొన్నారు. ఆయా పథకాలకు లబ్ధిదారుల ఎంపిక నిమిత్తం మంగళవారం కార్పొరేషన్ పరిధిలోని 11,12,13,14,15, 16,17,18వ డివిజన్లలో వార్డు సభలు నిర్వహించారు. పలు వార్డుల్లో ఏర్పాటు చేసిన సభల్లో కమిషనర్ పి.సరస్వతితో కలిసి మేయర్ పారిజాతారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా పథకాలకు ఎంపికైన లబ్ధిదారుల పేర్లతో కూడిన జాబితాలను అధికారులు చదివి వినిపించారు. అదే విధంగ జాబితాల్లో పేర్లు రాని వారి నుంచి దరఖాస్తులు స్వీకరించారు.

మీర్‌పేట్‌లో: పలు డివిజన్ల పరిధిలో ప్రభుత్వ సంక్షేమ పథకాలకు లబ్ధిదారులను ఎంపిక చేసేందుకుగాను మంగళవారం వార్డు సభలు నిర్వహించారు. మేయర్ దుర్గాదీప్‌లాల్, మునిసిపల్ కమిషనర్ ఆర్. జ్ఞానేశ్వర్ పలు సభల్లో పాల్గొని ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఇప్పటికే ఆయా పథకాలకు ఎంపికైన వారి పేర్లతో కూడిన జాబితాలను సభల్లో చదివి వినిపించి స్థానికుల నుంచి అభ్యంతరాలు స్వీకరించారు. జాబితాల్లో పేర్లు లేని వారి నుంచి తాజాగా దరఖాస్తులు స్వీకరించారు. పలువురు కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, మునిసిపల్ సిబ్బంది ఆయా సభల్లో పాల్గొన్నారు.



బడంగ్‌పేట్‌లో ఇందిరమ్మ ఇంటి కోసం మేయర్ పారిజాతారెడ్డికి దరఖాస్తు అందజేస్తున్న మహిళ



పెద్దఅంబర్‌పేట్ వార్డు సభలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ జయశ్రీ, కౌన్సిలర్ రాజేందర్

అబ్దుల్లాపూర్‌మెట్‌లో...

అబ్దుల్లాపూర్‌మెట్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల ఎంపికలో భాగంగా అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని బలిజగూడ, లష్కర్‌గూడ, అబ్దుల్లాపూర్‌మెట్, పిగ్లీపూర్, గండిచెరువు గ్రామాల్లో గ్రామ సభలు జరిగాయి. ఉదయం 10 గంటల గ్రామ సభలు ఆయా గ్రామాలకు కేటాయించిన ప్రత్యేక అధికారులు ప్రారంభించారు. లష్కర్‌గూడలో రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో అర్హుల పేర్లు కాకుండా అనర్హుల పేర్లు ఎక్కువగా ఉన్నాయంటు పలువురు సభ దృష్టికి తీసుకువచ్చారు. రేషన్ కార్డు జాబితాలో తన పేరు రాలేదని భాగ్య ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో స్పెషల్ ఆఫీసర్ సుదర్శన్ రెడ్డి కల్పించుకుని అర్హులైనా వారందరు మరోసారి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హులైనా ప్రతి ఒక్కరికి పథకాలను అందిస్తామని తెలిపారు. గండిచెరువు గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల లిస్టులో పేరు లేని వారు అధికారులతో వాగ్వాదం చేశారు. మరోసారి దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించడంతో నెమ్మదించారు. గ్రామ సభలో రేషన్ కార్డుల, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసాతో పాటు రైతు భరోసా లబ్ధిదారుల ఎంపిక లిస్టును అధికారులు చదివి వినిపించారు.

పెద్దఅంబర్‌పేట్‌లో...

పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో రెండు దఫాలుగా వార్డు సభలను నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డుల లబ్ధిదారుల ఎంపిక లిస్టును సభలో పెట్టారు. వాటిపై అభ్యంతరాలు కోరారు. ఆయా పథకాలకు సంబంధించి లిస్టులో పేరురాని వారి నుంచి దరఖాస్తులను స్వీకరించారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

● తుర్కయంజాల్ మున్సిపాలిటీ చైర్ పర్సన్ అనురాధ రాంరెడ్డి

హయత్‌నగర్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలో మంగళవారం చేపట్టిన సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపిక గ్రామ సభలు ప్రశాంతంగా జరిగాయి. మున్సిపాలిటీ చైర్ పర్సన్ మల్‌రెడ్డి అనురాధ రాంరెడ్డి తొర్రూర్ వార్డు కార్యాలయంలో నిర్వహించిన వార్డు సభలో ఆమె పాల్గొనారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలను దృష్టిలో పెట్టుకుని ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరు ఉపయోగించుకోవాలని కోరారు. రేషన్ కార్డు అందని వారు తిరిగి వార్డు కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు, రైతు బరోసా, రేషన్ కార్డులు అందివ్వడానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ప్రజలు ఏలాంటి అపోహలకు గురికాకుండా సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కమిషనర్ అమరేందర్‌రెడ్డితో పాటు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



తొర్రూర్‌లో నిర్వహించిన వార్డు సభలో మాట్లాడుతున్న తుర్కయంజాల్ మున్సిపాలిటీ చైర్ పర్సన్ మల్‌రెడ్డి అనురాధ రాంరెడ్డి

టార్గెట్‌కు చేరువలో మార్కెట్ ఆదాయం

ఓల్డ్‌మలక్‌పేట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మలక్‌పేటలోని హైదరాబాద్ జాతీయ వ్యవసాయ మార్కెట్ ఆదాయం టార్గెట్‌కు చేరువలో ఉంది. ఈ సంవత్సరం టార్గెట్ రూ.15 కోట్లు నిర్దేశించగా ఇప్పటికి రూ.12 కోట్లు దాటింది ఇంకా రెండు నెలల సమయం ఉంది. మార్చి చివరికల్లా నిర్దేశించిన టార్గెట్ చేరుకుంటామని మార్కెట్ అధికారులు చెబుతున్నారు. గత సంవత్సరం రూ.13 కోట్ల ఆదాయం వచ్చింది. మార్కెట్‌లో రైతుల దగ్గర దాన్యాన్ని కొనుగోలు చేసినందుకు వ్యాపారులు మార్కెట్‌కు వందకు ఒక రూపాయిచొప్పున మార్కెట్ ఫీజు (1 శాతం) చెల్లించాల్సి ఉంటుంది. ప్రతిఏటా టార్గెట్ పెంచుతూనే ఉన్నా దానిని సులువుగా చేరుకుంటుంది. మార్కెట్ అధాకారులు సిబ్బంది సమన్వయంతో పనిచేసి మార్కెట్ ఆదాయం పెంచేదిశగా కృషిచేస్తున్నారు. ఇక్కడ రైతులు తెచ్చిన పంటకు మంచి ధర పలుకుతుండడంతో మార్కెట్‌కు పెద్ద ఎత్తున దాన్యం వస్తుంది తద్వారా ఆదాయం కూడా పెరుగుతుంది. ఉల్లి విక్రయాల్లో పేరుగాంచింది ఇక్కడ సంవత్సరం పొగవునా ఉల్లి విక్రయాలు పెద్ద ఎత్తున జరుగుతాయి ఉల్లి విక్రయాల ద్వారానే ప్రధాన ఆదాయం సమకూరుతుంది.

టార్గెట్ పూర్తిచేస్తాం



మార్కెట్ ఆదాయం నిర్దేశించిన టార్గెట్ రూ.15 కోట్లు. రెండు నెలలు సమయం ఉంది ఈ రెండు నెలలు క్రయవిక్రయాలు పెద్ద ఎత్తున జరుగుతాయి. మార్కెట్‌లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పంట కొనుగోళ్లు పారదర్శకంగా ఈనామ్ ద్వారా జరుగుతాయి. పెద్ద ఎత్తున మార్కెట్‌కు ధాన్యం వస్తుంది తద్వారా అనుకున్నమేర ఆదాయం సమకూరుతుంది. రైతులు పంటను గ్రేడింగ్ చేసి తీసుకురావాలి గ్రేడింగ్ చేయడంవల్ల మంచి ధర పలుకుతుంది.

-దామోదర్, ఎజీఎస్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న జిల్లా యువజన అధికారి కుష్బు గుప్తా

24 నుంచి ట్రైబల్ యూత్ ఎక్స్చేంజ్ ప్రోగ్రాం

సైదాబాద్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ట్రైబల్, యువజన వ్యవహారాల శాఖలు, నెహ్రూ యువ కేంద్ర సంఘటన్ సంయుక్త ఆధ్వర్యంలో రాజేంద్రనగర్‌లోని కో-అపరేటివ్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్‌లో ఈ నెల24 నుంచి 30 వరకు ట్రైబల్ యూత్ ఎక్స్చేంజ్ ప్రోగ్రాం-2025 నిర్వహిస్తున్నట్లు నెహ్రూ యువ కేంద్ర సంఘటన్ హైదరాబాద్ జిల్లా యువజన అధికారి కుష్బు గుప్తా తెలిపారు. మలక్‌పేట కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఆదివాసీ యువతలో జాతీయ ఐక్యత, సమగ్రతను కాపాడటం కోసం వారం రోజుపాటు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ ఉత్సవాల్లో మహారాష్ట్ర, చత్తీస్‌ఘడ్, ఝార్ఖండ్ రాష్ట్రాలకు చెందిన 200 మంది యువత పాల్గొంటారని వెల్లడించారు. అనంతరం రాష్ట్ర ఆదనపు డైరెక్టర్ రాజేశ్‌తో కలిసి ప్రోగ్రాం పోస్టర్‌ను ఆవిష్కరించారు.



లెనిన్ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

సీపీఐ కార్యాలయంలో లెనిన్ వర్ధంతి

హయత్‌నగర్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్ సీపీఐ కార్యాలయంలో లెనిన్ 101వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా లెనిన్ చిత్ర పటానికి ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందోజు రవీంద్రచారి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయన ఉద్యమ స్ఫూర్తి మరువలేనిదన్నారు. కార్యక్రమంలో హయత్‌నగర్ మండల కార్యదర్శి శ్రీదేవి, సహాయ కార్యదర్శులు అరుణ్‌కుమార్, శోభన్, వంశీవర్ధన్‌రెడ్డి, సుజాత, వెంకట్, శ్రీధర్‌రెడ్డి, సుమతి, అలివేణి, యమునా, ముత్తయ్య, శివజ్యోతి, రాములు, సురేందర్, రేణుక తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేట: ప్రపంచ శ్రామిక వర్గాల అభ్యున్నతికి బాటలు వేసిన కమ్యూనిస్టు మహావిప్లవ నేత లెనిన్‌కు న్యూనాగోల్ ఎస్ఏ డాంగే భవన్‌లో సీపీఐ నాయకులు మంగళవారం ఘనంగా నివాళులర్పించారు. ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి స్థానిక నాయకులు లెనినిజం ప్రధాన్యతను గుర్తు చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు బాతరాజు నర్సింహ, నాయకులు ఎండీ హమీద్, యూ. మల్లేష్‌గౌడ్, డి.నిరంజన్, శ్యామల, పద్మ, జాఫర్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



సదస్సును ప్రారంభిస్తున్న జేఎన్‌టీయూ ఇన్‌చార్జి వీసీ బాలకిష్టారెడ్డి

ఫార్మా రంగానికి ఉజ్వల భవిష్యత్తు

● జేఎన్‌టీయూ ఇన్‌చార్జి వీసీ బాలకిష్టారెడ్డి

హైదరాబాద్ సిటీ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఫార్మాస్యూటికల్ రంగానికి ఉజ్వల భవిష్యత్తును అందించడంలో యంగ్ ప్రొఫెషనల్స్ కీలకపాత్ర పోషిస్తున్నారని, త్వరలోనే ఇండియన్ ఫార్మా మార్కెట్ 130 బిలియన్ డాలర్లకు చేరువ కానుందని జేఎన్‌టీయూ ఇన్‌చార్జి వైస్‌చాన్స్‌లర్ డాక్టర్ బాలకిష్టారెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. 'ఇన్నోవేషన్స్ ఇన్ ఫార్మా-హౌ యంగ్‌లీడర్స్ కెన్ డ్రైవ్ చేంజ్' అంశంపై జేఎన్‌టీయూ ఆడిటోరియంలో మంగళవారం ఏర్పాటు చేసిన జాతీయ సదస్సును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆవిష్కరణ, నాయకత్వం, సహకారం వంటి అంశాలలో నిపుణులతో మార్గదర్శకత్వం పొందడానికి ఈ సదస్సు వేదికగా నిలిచిందన్నారు. వినూత్న ఆలోచనలు, నాయకత్వ లక్షణాలు కలిగిన యువత భవిష్యత్తులో సరికొత్త అవకాశాలను కనుగొనాలని పిలుపునిచ్చారు. జాతీయ, అంతర్జాతీయ సంస్థలతో అవగాహన ఒప్పందా (ఎంఓయూ) లను కుదుర్చుకోవడం ద్వారా విద్యార్థులకు ఆయా పరిశ్రమలలో తమ ప్రతిభను ప్రదర్శించే అవకాశాలు లభిస్తాయన్నారు. ప్రపంచానికి అవసరమైన సరికొత్త ఆవిష్కరణలు అందించడంలో పరిశ్రమలతో కలిసి విద్యాసంస్థలు కీలక పాత్ర పోషించాలన్నారు. కార్యక్రమంలో వర్సిటీ రెక్టార్ విజయకుమార్ రెడ్డి, రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు, ఫార్మాస్యూటికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా మాజీ అధ్యక్షుడు సురేశ్, అమెరికాకు చెందిన అల్బనీ ఫార్మసీ కళాశాల చైర్మన్ టోయిన్ టోఫాడీ, క్రొయేషియాలోని ఫార్మసీ కౌన్సిల్ అధ్యక్షుడు మేస్త్రోనిక్ అరిజానా తదితరులు పాల్గొన్నారు.

త్వరలో గ్రంథాలయాల్లో ఖాళీ పోస్టుల భర్తీ

● నూతన చైర్మన్ ఉపేందర్‌రెడ్డి

చాదర్‌ఘాట్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): మూసారాంబాగ్ శాఖా గ్రంథాలయాన్ని మంగళవారం హైదరాబాద్ నగర గ్రంథాలయ సంస్థ నూతన చైర్మన్ కె.ఉపెందర్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రంథాలయాల అభివృద్ధి కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని ఈ సందర్భంగా ఆయన విమర్శించారు. 10 ఏళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రభుత్వ ఖాళీలను కూడా భర్తీ చేయకుండా నిరుద్యోగులను అన్యాయం చేసిందన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి రాగానే నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారన్నారు. త్వరలో గ్రంథాలయాల్లో కూడా ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసేందుకు చర్యలు చేపడతామని ఆయన ప్రకటించారు. నగర గ్రంథాలయాల సంస్థ కార్యదర్శి పద్మజ, మూసారాంబాగ్ గ్రంథాలయ గ్రంథపాలకుడు తారక రమేష్, కృష్ణానగర్ లైబ్రేరియన్ శంకర్ తదితరులు పాల్గొన్నారు

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సంతోష్‌నగర్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): టీఎస్ఎస్‌పీడీసీఎల్ సరూర్‌నగర్ డివిజన్ పరిధిలోని 11 కేవీ హౌసింగ్ బోర్డు, ఇందుఅరణ్య అపార్ట్‌మెంట్, వాంబేకాలనీ ఫీడర్ల పరిధిలోని ప్రాంతాలలో నిర్వహణపనుల కారణంగా బుధవారం విద్యుత్ సరఫరా ఉండదని డీఈ తెలిపారు. 11 కేవీ హౌసింగ్ బోర్డు, ఇందు అరణ్య అపార్ట్‌మెంట్ ఫీడర్ల పరిధిలోని ప్రాంతాల్లో మధ్యాహ్నం 12 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు, 11 కేవీ వాంబేకాలనీ ఫీడర్ పరిధిలోని ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్‌సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆయన తెలిపారు.

మలక్‌పేటలో అభివృద్ధి పనులు: ఎమ్మెల్యే బలాల

చాదర్‌ఘాట్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మలక్‌పేట అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని చావునీ, ఓల్డ్‌మలక్‌పేట, అక్బర్‌బాగ్ డివిజన్లలో రూ.8.22 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే అహ్మద్ బలాల తెలిపారు. మంగళవారం చావునీ, అక్బర్‌బాగ్ డివిజన్ కార్పొరేటర్లు షాహిద్ మూస్, మిన్హాజుద్దీన్, ఓల్డ్‌మలక్‌పేట డివిజన్ ఎంఐఎం అధ్యక్షుడు సైఫుద్దీన్ షఫీతో కలిసి జీహెచ్ఎంసీ మలక్‌పేట సర్కిల్-6 ఈఈ పీర్‌సింగ్, ఏఈ మల్లికార్జున్‌తో ఎమ్మెల్యే పెండింగ్‌లో ఉన్న పనులు, ప్రస్తుతం కొనసాగుతున్న అభివృద్ధి పనులు, కొత్తగా మంజూరైన అభివృద్ధి పనులపై సమీక్షా సమావేశం నిర్వహించి చర్చించారు. అవసరమైన చోట అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు తయారు చేయిస్తున్నట్లు తెలిపారు.



కాలనీవాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

యూజీడీ పనులు ముగించాలి

● కార్పొరేటర్ పవన్‌కుమార్

కొత్తపేట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ యూజీడీ రీమాడలింగ్ పనులు త్వరగా ముగించాలని కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్ జలమండలి అధికారలుకు సూచించారు. మోహన్‌నగర్ జనప్రియ క్వార్టర్లు, బాలాజీనగర్ కాలనీ వద్ద మంగళవారం రూ.9 లక్షల తో రీమాడలింగ్ భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్ పనులు ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో ఆయన మాట్లాడుతూ పనుల అనంతరం ప్యాచ్ వర్క్ కూడా త్వరగా చేపట్టాలన్నారు. తమ దృష్టికి వచ్చిన కాలనీ వాసుల సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తసుకుంటామని అన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

అబ్దుల్లాపూర్‌మెట్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం తారామతిపేట గ్రామ పరిధి సద్దుపల్లి శివారు సర్వే నంబర్ 170 బ్రిక్స్ కంపెనీ వెనుకాల గుంతలో వ్యక్తి మృతదేహం ఉన్నట్లు గమనించిన స్థానికులు అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసుకు సమాచారం అందించారు. వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించగా ఏలాంటి ఆధారాలు లభించలేదు. అతడి ఒంటిపై నేవీ బ్లూ కలర్ ఫుల్ హ్యాండ్స్ టీషర్టు ఉందని, వయస్సు సుమారు 45 నుంచి 50 ఏళ్లు ఉంటాయని తెలిపారు. 5 రోజుల క్రితం మృతి చెంది ఉంటాడని మృతదేహం పూర్తిగా కుళ్లిపోవడంతో గుర్తు పట్టరాకుండా మారిందన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.